క్లుప్తంగా

ఘనంగా ఎత్నిక్ డే వేడుకలు



సంప్రదాయ దుస్తులతో నృత్యం

హిందూపురం టౌన్: స్థానిక ఎస్‌డీజీఎస్ కళాశాలలో ఎంబీఏ, బీబీఏ విద్యార్థులు ఎత్నిక్ డేని బుధవారం ఘనంగా నిర్వహించారు. తెలుగుదనం ఉట్టిపడే సంక్రాంతి, బతుకమ్మ పండుగలు, కేరళ సంప్రదాయాన్ని ప్రతిబింబించే ఓనం పండుగ, మహారాష్ట్ర గుడి పడ్వా పండుగను, ఉట్టి కొట్టడం తదితర సంస్కృతి సంప్రదాయాలను కనులకు కట్టే విధంగా సంబంధిత వస్త్రాధారణతో, నాట్యాలతో సంబరాలు చేసుకున్నారు. కళాశాల కార్యదర్శి బైసాని రామ్‌ప్రసాద్ , ఎంబీఏ కళాశాల ప్రిన్సిపాల్ నాగేంద్ర కుమార్, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఏఎస్‌పీఎస్ ప్రసాద్, హెచ్‌ఓడీ అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సేవలను సద్వినియోగం చేసుకోండి



పెద్దమంతూరు ఆధార్ కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న ఎంపీడీఓ

రొద్దం: మండల పరిధిలోని పెద్దమంతూరు సచివాలయంలో ఏర్పాటు చేసిన ఆధార్ నమోదు కేంద్రాన్ని బుధవారం ఎంపీడీఓ రాబర్ట్‌విల్సన్ తనిఖీ చేశారు. ప్రజలకు అనుకూలంగా ఏర్పాటు చేసిన ఆధార్ సెంటర్‌ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ అన్నారు. అలాగే కలిపి గ్రామంలో జరుగుతున్న నాడు–నేడు పనులను ఎంపీడీఓ పరిశీలించారు.

మొక్కల పెంపకానికి ప్రాధాన్యత



బుళ్లసముద్రం వద్ద మొక్కల పెంపకానికి గుంతలు తీస్తున్న కూలీలు

మడకశిరరూరల్: మండలంలో ఉపాధి హామీ పథకం ద్వారా రైతులు పొలాల్లో మొక్కల పెంపకానికి అధిక ప్రాధాన్యత కల్పిస్తున్నామని ఏపీఓ శ్రీకాంత్‌గౌడు తెలిపారు. బుధవారం బుళ్లసముద్రం పంచాయతీలో రైతు పొలాల్లో మొక్కల పెంపకానికి తీస్తున్న గుంతలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఏపీఓ మాట్లాడుతూ రెండు రోజుల క్రితం వర్షం పడటంతో గుంతలు తీయడానికి భూమి అనుకూలంగా మారిందన్నారు. రైతులకు అవసరమయ్యే నాణ్యమైన మొక్కలు అందించి పెంపకాన్ని పోత్సహిస్తామని తెలిపారు. ప్రభుత్వం కూడా మొక్కల పెంపకానికి ఎంతగానో కృషి చేస్తోందన్నారు. కూలీలు స్థానికంగా కల్పించే ఉపాధి పనులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా 'హీరో ప్యాషన్ ప్లస్' ఆవిష్కరణ



హీరో ప్యాషన్ ప్లస్ బైక్‌ను ఆవిష్కరిస్తున్న ఆర్టీఓ కరుణసాగర్‌రెడ్డి

హిందూపురం టౌన్: ద్విచక్ర వాహన సంస్థ హీరో మోటోకార్ప్ నుంచి మోడల్ ప్యాషన్ ప్లస్ నూతన మోడల్‌ను బుధవారం ఆర్టీఓ కరుణాసాగర్‌రెడ్డి ఆవిష్కరించారు. స్థానిక సాయితేజ మోటర్స్‌లో జరిగిన ప్యాషన్ ప్లస్ ఆవిష్కరణ కార్యక్రమానికి ఆర్టీఓ ముఖ్యఅతిథిగా పాల్గొని రిబ్బన్‌కట్ చేసి బైక్ లాంచ్ చేశారు. ఆర్టీఓ కరుణాసాగర్‌రెడ్డి మాట్లాడుతూ బీఎస్–6 నిబంధనలకు లోబడి బైక్‌ను తీసుకురావడం శుభపరిణామమన్నారు. అనంతరం సాయితేజ మోటర్స్ యాజమాని పీ.ఎల్.ఎం.నాయుడు మాట్లాడుతూ ప్యాషన్ ప్లస్‌లో కొత్త వెర్షన్‌ను విడుదల చేశామని, ఆకర్షణీయమైన ధరతో పాటు 100 సీసీ ఇంజిన్‌తో గరిష్టంగా 5.9 కిలోవాట్ శక్తి, 8 వేల ఆర్పీఎం బైక్ పనిచేస్తుందన్నారు. సైడ్ స్టాండ్ ఇండికేటర్, మొబైల్ చార్జింగ్ పోర్ట్ లాంటి ఫీచర్స్‌తో బైక్‌ను అందుబాటులోకి తెచ్చామన్నారు. ఈ నెల 16 నుంచి డెలివరీలు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు.

డ్రైవర్ల సమస్యలు పరిష్కరించండి

హిందూపురం టౌన్: స్థానిక ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో డ్రైవర్లు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని సిబ్బంది డిమాండ్ చేశారు. ఇందులో భాగంగానే నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ డిపో కమిటీ ఆధ్వర్యంలో బుధవారం ఎర్రబ్యాడ్జీలు ధరించి విధుల్లో పాల్గొన్నారు. డ్రైవర్ల సమస్యలపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా స్పందించడం లేదన్నారు. అలాగే తిరుపతికి లింకులు తొలగించాలని, అక్రమ సస్పెన్షన్లు రద్దు చేయాలని, తదితర డిమాండ్లను పరిష్కరించాలన్నారు.

జింకకు చెలగాటం.. రైతుకు సంకటం

- పెరిగిన జింకల సంచారంతో అన్నదాతల ఆందోళన
- పొలాల్లోకి రాకుండా చేయాలని అటవీశాఖ అధికారులకు మొర

మడకశిరరూరల్: మండల వ్యాప్తంగా వివిధ గ్రామాల్లోని రైతులు వేరుశనగ పంట సాగు చేయడానికి సమాయత్తం అవుతున్నారు. అయితే దాదాపుగా అన్ని చోట్లా జింకలు హల్‌చల్ చేస్తుండటంతో వాటిని నివారించేందుకు రైతులు నానా అవస్థలు పడుతున్నారు. జింకలను నివారించేందుకు వివిధ మార్గాలను అనుసరిస్తున్నారు. పొలం చుట్టూ ముళ్ల తంతి, నెట్ లాంటివి ఏర్పాటు చేసుకుంటున్నారు.

వర్షాలు విస్తారంగా కురవడంతో...

గతంలో జింకల బెడద తక్కువగా ఉండేదని రైతులు చెబుతున్నారు. అయితే గత ఏడాదిలో విస్తారంగా వర్షాలు కురువడంతో కొండల్లో చెట్లు అధికంగా పెరిగాయి. దీంతో జింకల సంచారం కూడా అధికమైంది. ముఖ్యంగా గౌడనహళ్లి, జమ్మానిపల్లి, తురకువాండ్లుపల్లి, బుళ్లసముద్రం, హరేసముద్రం, మణూరు, ఆర్ అనంతపురం, కల్లుమర్రి పంచాయతీల్లోని గ్రామాల్లో జింకల బెడద మరీ ఎక్కువగా ఉంది.

నాలుగేళ్ల నుంచి ప్రభుత్వం ఖరీఫ్ సీజన్ ప్రారంభంలోనే గ్రామస్థాయిలోనే సబ్సిడీ విత్తన కాయలు అందించడంతో రైతులు వేరుశనగ పంట సాగుపై ఆసక్తిని పెంచుకున్నారు. అయితే జింకలు బెడద అధికంగా ఉండటంతో వేరుశనగ విత్తనాలు వేసినప్పటి నుంచి పంటలోకి జింకలు ప్రవేశించకుండా కాపలాగా ఉండాల్సి వస్తోందని అన్నదాతలు వాపోతున్నారు. తాజాగా ఖరీఫ్ సీజన్ ప్రారంభం అవుతుండటంతో వేరుశనగ పంట సాగుకు రైతులు సిద్ధమవుతున్నారు. ఈ నేపథ్యంలో జింకల బెడదను నివారించాలని ఆయా గ్రామాల రైతులు అటవీశాఖ అధికారులకు మొరపెట్టుకుంటున్నారు. ఇదే విషయాన్ని జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు స్థానిక అటవీశాఖ అధికారులు చెబుతున్నారు. జింకలు పంటను నష్టం చేస్తే నష్టాన్ని అంచనా వేసి పరిహారం అందించడానికి చర్యలు తీసుకొంటామని అంటున్నారు.



పొలాల్లో సంచరిస్తున్న జింకలు



పొలంలోకి జింకలు రాకుండా నెట్ వేస్తున్న దృశ్యం

అధికారులు చర్యలు తీసుకోవాలి



రబీలో బోరు బావుల కింద, ఖరీఫ్‌లో సాగు చేసే పంటలకు జింకల బెడద అధికంగా ఉంది. ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని ప్రొత్సహించడంతో నాకున్న 10 ఎకరాల్లో 6 ఎకరాల్లో వేరుశనగ, మిగిలిన భూమిల్లో కందులను సాగు చేయడానికి సిద్ధం చేసుకున్నాం. పంట సాగు చేసినప్పటి నుంచి పంట చేతికందే వరకు పంటలోకి జింకలు ప్రవేశించకుండా కాపలా ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. పంటలోకి జింకలు ప్రవేశించకుండా అటవీశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలి.

– వెంకటేష్, రైతు ఆర్ అనంతపురం

ఉష్ణోగ్రత సమాచారం

(గరిష్ఠం)

హిందూపురం	35.0
పెనుకొండ	40.0
మడకశిర	35.0

రీ సర్వే వేగవంతం చేయండి

మడకశిరరూరల్: ప్రభుత్వం రైతులకు మేలు చేయాలనే లక్ష్యంతో వైఎస్సార్ జగనన్న శాశ్వత భూ హక్కు , భూ రక్షణ పథకాన్ని అమలు చేసిందని సబ్ కలెక్టర్ కార్తీక్ తెలిపారు. ఆయన బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించి భూ సర్వే, రెవెన్యూ సమస్యలపై చర్చించారు. ఇప్పటి వరకు ఎన్ని గ్రామాల్లో భూ సర్వే చేశారని ఆరా తీశారు. ఈ సందర్భంగా సబ్‌కలెక్టర్ మాట్లాడుతూ రెవెన్యూ రికార్డుల ప్రకారం భూ సర్వేలో తప్పులు దొర్లకుండా జాగ్రత్తలను పాటించాలని సూచించారు. రీసర్వే ద్వారా శాశ్వతంగా భూ సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు. అదే విధంగా స్థిరాస్తులకు రక్షణ కల్పిస్తూ యజమానులకు శాశ్వత భూ హక్కు కల్పించవచ్చన్నారు. భూ వివాద రహిత గ్రామాలుగా తీర్చిద్దేందుకు సమిష్టిగా పని చేయాలన్నారు. అదే విధంగా రెవెన్యూ సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యత కల్పించి పరిష్కరం చూపాలన్నారు. కార్యాక్రమంలో ఇన్‌చార్జ్ తహసీల్దార్ బాలాంజినేయులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఇసుక రీచ్ వద్ద నిరసన



జయమంగళి నదిలో ఇష్టారాజ్యంగా ఇసుక తోడేస్తున్న దృశ్యం

పరిగి: మండల కేంద్రంలోని జయమంగళీ నదిలో ఏర్పాటు చేసిన ఇసుక రీచ్‌లో ప్రభుత్వం ఇచ్చిన పరిమితి కంటే మించి లోతుకు తవ్వి ఇసుకను అక్రమంగా తోడేస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈక్రమంలో బుధవారం సీపీఎం నాయకులు రీచ్ వద్ద ఆందోళన చేపట్టారు. నాయకులు మాట్లాడుతూ స్థానిక అవసరాల కోసం ప్రభుత్వం ఇసుక రీచ్‌ను ఏర్పాటు చేసిందన్నారు. అయితే సదరు కాంట్రాక్టర్ నిబంధనలు తుంగలో తొక్కి ఇష్టారాజ్యంగా ఇసుకను తవ్వి, వేరే ప్రాంతాల్లో అక్రమంగా నిల్వ చేసుకుంటూ సొమ్ము చేసుకుంటున్నారని ఆరోపించారు. మైనర్ బాలుడిని డ్రైవరుగా పెట్టి ఇటాచీతో ఇసుక తవ్వుస్తున్నా పట్టించుకొనేవారే లేరన్నారు. ఉన్నతాధికారులు వెంటనే స్పందించి ఇసుకను ఇష్టానుసారంగా తరలించకుండా చర్యలు చేపట్టి ప్రభుత్వ ఆదాయానికి గండిపడకుండా చూడాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో నాయకులు, కిరణ్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ బీమా నమోదుకు గడువు పెంపు

రొద్దం: వైఎస్సార్ బీమా నమోదు చేయడానికి ఈనెల 15 వరకూ ప్రభుత్వం గడువు పొడించినట్లు ఎంపీడీఓ రాబర్ట్‌విల్సన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటిదాకా వంద శాతం పూర్తి చేయనివారు గడువులోగా పూర్తి చేయాలని సూచించారు. అర్హులకు అన్యాయం జరిగితే సంబంధిత అధికారులు బాధ్యత వహించాల్సి వస్తుందని హెచ్చరించారు.

సమస్యలు పరిష్కరించండి

చిలమత్తూరు: మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అనంతపురం పర్యటన ముగించుకొని తిరుగు ప్రయాణంలో బాగేపల్లి టోల్‌గేట్ వద్ద నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ నాయకులు కలిశారు. ఈ సందర్భంగా పలు సమస్యలను వారు మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ప్రధానంగా పలగలపల్లిలో తొలగించిన నలుగురు వలంటీర్లను కొనసాగిస్తామని అధికారులు తెలిపారని, ఇంకా పెండింగ్‌లోనే ఉంచారని సర్పంచ్ బందేపల్లి శంకర్‌రెడ్డి మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కరిస్తానని మంత్రి హామీ ఇచ్చారు. అనంతరం విద్యుత్ ఏఈ నారాయణస్వామి తమను ఇబ్బంది పెడుతున్నారని కిందిస్థాయి సిబ్బంది, కాంట్రాక్టర్లు, రైతులు ఫిర్యాదు చేశారు. ఏఈ వివరాలను తీసుకున్న ఆయన శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఎంపీపీ పురుషోత్తమరెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ బలరామిరెడ్డి, కౌన్సిలర్లు అసిఫ్, శివ, వెంకటేష్‌రెడ్డి, తిమ్మిరెడ్డి, శెట్టిపల్లి స్వామి, శివప్రసాద్‌రెడ్డి, ఈడిగ సూర్యనారాయణ, హరి, చౌడప్ప, రవి, నవీన్‌తదితరులు పాల్గొన్నారు.



బాగేపల్లి టోల్‌ప్లాజా వద్ద మంత్రి పెద్దిరెడ్డికి సమస్యలు వివరిస్తున్న నాయకులు

సోలార్ భూములకు రైతులే యజమానులు

- కర్ణాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్

పావగడ: 'సోలార్ ప్రాజెక్ట్ ఏర్పాటుకు భూములిచ్చిన రైతులే ఆ భూములకు యజమానులు.. ఆ భూములపై బ్యాంకుల్లో రుణాలు తీసుకోవచ్చు... క్రమం తప్పకుండా ఆర్థిక పరిహారం అందుతోంది.. సోలార్ భూములపై రైతులు ఎలాంటి ఆందోళన చెందవద్దు' అని కర్ణాటక డిప్యూటీ ముఖ్యమంత్రి డీకే శివకుమార్ అన్నారు. స్థానిక తిరుమణి సోలార్ పార్క్‌లో బుధవారం సోలార్ భూముల రైతులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మాట్లాడుతూ కొన్నిచోట్ల రైతుల నుంచి భూములు కొనుగోలు చేసి సోలార్ ప్రాజెక్టులను నిర్మిస్తున్నారని అయితే రైతులకు నష్టం వాటిల్లకుండా లీజ్ పద్ధతిలో భూములను తీసుకుని వారికి ఆ భూములపై హక్కులు ఉండేలా రిజిస్ట్రేషన్ చేయించామన్నారు. ఇంకా 10 వేల ఎకరాల్లో సోలార్ ప్రాజెక్ట్‌ను నిర్మించే ఆలోచన ప్రభుత్వానికి ఉందన్నారు. రైతులు ఒకే చోట 10 వేల ఎకరాల భూమిని ఇవ్వాలని కోరారు. ఎమ్మెల్యే వెంకటేష్ చొరవ తీసుకుని భూములను సేకరించే దిశగా చర్యలు చేపట్టాలన్నారు. రాష్ట్ర ఇంధన శాఖా మంత్రి కేజే జార్జ్ మాట్లాడుతూ సోలార్‌పార్క్ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ జిల్లా కలెక్టర్ విద్యాకుమారి, కేఎస్‌పీడీసీఎల్ ఎండీ పంకజ్ పాండ్యా, కార్యదర్శి గౌరవ్ గుప్తా, సీఈఓ అమర్నాథ్, డీసీసీ అధ్యక్షుడు చంద్రశేఖర్‌గౌడ, బత్తినేని నాని తదితర సోలార్ పార్క్ అధికారులు పాల్గొన్నారు.



సోలార్ పార్కును పరిశీలిస్తున్న డిప్యూటీ సీఎం శివకుమార్

రక్తదానం సామాజిక బాధ్యత

- సబ్ కలెక్టర్ కార్తీక్

హిందూపురం టౌన్: ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా రక్తదానం చేయాలని పెనుకొండ సబ్ కలెక్టర్ కార్తీక్ పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ, బ్లడ్ బ్యాంక్ ఆధ్వర్యంలో ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని పురస్కరించుకుని రక్తదాతల సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి సబ్ కలెక్టర్‌తో పాటు రెడ్ క్రాస్ జిల్లా అధ్యక్షుడు జీఎం శేఖర్, కార్యదర్శి, రిటైర్డ్ డిప్యూటీ కలెక్టర్ విశ్వనాథ్, ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్ రోహిల్‌కుమార్, ఆర్ఎంఓ సురేష్‌కుమార్, తహసీల్దార్ హసీనా సుల్తానా హాజరయ్యారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ కార్తీక్ మాట్లాడుతూ అత్యవసర సమయాల్లో క్షతగాత్రులకు, గర్భిణీలకు, అనీమియా, తలసేమియా బాధితులకు రక్తం అందించి ప్రాణదాతలుగా మారారన్నారు. వారి సేవలు మరువలేనివన్నారు. రక్తదాతలు ఇతరుల ప్రాణాలను కాపాడి మానవత్వాన్ని చాటాలన్నారు. కుల, మతాలకు అతీతంగా 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలన్నారు. రక్తదానం చేయడం ద్వారా ఎలాంటి సమస్యలు రావని, మరింత ఆరోగ్యంగా ఉంటామని పేర్కొన్నారు. ఉమ్మడి జిల్లాలో జాతీయ రహదారులు ఉండటంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని, ఆస్పత్రిలోని బ్లడ్ బ్యాంక్‌లో రక్తం నిల్వ ఉంచుకోవాలని వైద్యులకు సూచించారు. అనంతరం ఎక్కువ సార్లు రక్తదానం చేసిన పలువురిని సత్కరించారు. బ్లడ్ బ్యాంక్ ఇన్‌చార్జ్ ప్రశాంత్, రెడ్ క్రాస్ మెంబర్లు బయారెడ్డి, డాక్టర్ రాజా, రెడ్ క్రాస్ కోఆర్డినేటర్ రమేష్, రక్తదాతలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ కార్తీక్

నేడు 'జగనన్న ఆణిముత్యాలు'

మడకశిర: పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో గురువారం ఉదయం 10 గంటలకు నియోజకవర్గస్థాయి జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు ఎంఈఓ భాస్కర్ తెలిపారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే తిప్పేస్వామి పాల్గొంటారన్నారు. నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో టెన్త్, ఇంటర్ పబ్లిక్ పరీక్షల్లో అత్యంత ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు అవార్డులు ప్రదానం చేయనున్నట్లు పేర్కొన్నారు. ఐదు మండలాల్లోని ప్రజాప్రతినిధులు, ఎంఈఓలు, హెచ్‌ఎంలు, విద్యార్థులు, తల్లిదండ్రులు కార్యక్రమానికి హాజరై విజయవంతం చేయాలని కోరారు.

ఘనంగా చెగువేరా జయంతి

పెనుకొండ: పట్టణంలోని సీఐటీయూ కార్యాలయంలో బుధవారం చెగువేరా 95వ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. నాయకులు రమేష్, బాబావలి తదితరులు చెగువేరా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన సేవలను కొనియాడారు.

పబ్లిక్ నోటీసు

ఇందుమూలంగా యావన్మందికి తెలియజేయడం ఏమనగా మా కక్షిదారురాలు కె.యస్. ప్రసన్నమ్మ భర్త కె.యస్. సుబ్బారెడ్డి, పి. కొత్తపల్లి గ్రామం, లేపాక్షి మండలం, షెడ్యూల్ దాఖలా ఆస్తిని రాజశేఖర్‌రెడ్డి తండ్రి లేట్ శంకర్ రెడ్డి 2. శ్రీమతి కె. రత్నమ్మ భర్త లేట్ సంజీవరెడ్డి, పి. కొత్తపల్లి గ్రామం, లేపాక్షి మండలం అనువారి నుండి సరైన క్రయధనము చెల్లించి 02-02-2022 నాడు రిజిష్టర్ పత్రము డాక్యుమెంట్ 1139/2022 క్రింద విక్రయము చేసుకొని స్వాధీనము చేసుకున్నారు. అప్పటి నుండి షెడ్యూల్ దాఖలా ఆస్తి మా కక్షిదారురాల యొక్క స్వాధీనములో వున్నది. ఇట్లుండగ సదరి షెడ్యూల్ గురించి సర్వే నెంబర్, చెక్కుబంది వ్రాయుటలో పొరపాటు జరిగినందు వలన మా కక్షిదారురాలు పై తెలిపిన రాజశేఖర్‌రెడ్డి మరియు కె. రత్నమ్మ అనువారికి సవరణ దస్తావేజు వ్రాసి ఇవ్వవలసిందిగా 26-10-2022 తేదీన లీగల్ నోటీసు పంపడం అయింది. వారు సవరణ దస్తావేజు వ్రాసి ఇవ్వనందులకు హిందూపురం జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో దస్తావేజు యొక్క షెడ్యూల్ సవరణ కొరకు O.S. NO. 51/2023 పై ఇద్దరిపై దాఖలు చేసి యున్నారు. అంతేగాక, I.A. 51/2023 పిటీషన్ షెడ్యూల్ దాఖలా ఆస్తి ఇతరులకు విక్రయించకుండా పిటిషన్ దాఖలు చేయడం అయినది. సదరి దావా మరియు పిటిషన్ పెండింగులో ఉన్నది. వాయిదా 19-06-2023 ఉన్నది. ఇట్లుండగ మా కక్షిదారురాలకు తెలియవచ్చినది ఏమనగా పై తెలిపిన రాజశేఖర్‌రెడ్డి వాస్తవాలను మరుగుపరచి షెడ్యూల్ దాఖలా ఆస్తిని ఇతరులకు విక్రయించుటకు ప్రయత్నిస్తున్నారని తెలిసింది అట్లు చేయుటకు వారికి ఎలాంటి హక్కు లేదు. కనుక ఎవ్వరేగాని రాజశేఖర్‌రెడ్డి పి.కొత్తపల్లి గ్రామము వారితో ఎలాంటి క్రయ, విక్రయాలు చేయకూడదని తెలియజేయడం అయినది, చేసిన అవి చెల్లవని మరియు మా కక్షిదారురాలు తీసుకొనబోవు చర్యలకు బాధ్యులగుదురని తెలియజేయడం అయినది.

SCHEDULE

Property situated in RD of Puttaparthy and SRD of Hindupuram within Kodihalli Village Polam, Lepakshi Mandal.

Babu	Sy. No.	Extent
Govt. Dry	146-1D	Ac. 0.10 Cents
Govt. Dry	146-1D	Ac. 0.10 Cents
		Total A.C. 0.20 Cents

Bounded by : East : Land of Naveen, West : House of Govinda Reddy, North : Land of Uma Sankar, South : Road.

C. RAMACHANDRA REDDY, Advocate, HINDUPURAM. Cell : 9948666425

రాగి సాగుపై రైతులకు అవగాహన

చిలమత్తూరు: మండల రైతాంగం రాగి సాగుపై దృష్టి సారించాలని జేడీఏ సుబ్బారావు సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని ఆర్బీకేలో రైతులతో ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా జేడీఏ రాగి సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. 4 కిలోల విత్తనం ధర రూ.278 కాగా 50 శాతం సబ్సిడీతో రూ.139 ఇవ్వనున్నట్లు తెలిపారు. ధాన్యాన్ని కూడా ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందన్నారు. పలువురు రైతులు క్రాఫ్ ఇన్సూరెన్స్ జమకాలేదని జేడీఏ దృష్టికి తీసుకురాగా త్వరలోనే ఆ మొత్తం రైతుల ఖాతాలకు జమ అవుతుందన్నారు.

హిందూపురం: తక్కువ కాలంలో తక్కువ ఖర్చుతో చీడపీడల బెడద లేకుండా ఇంద్రావతి రకం రాగి పంట సాగు చేసుకోవాలని సబ్‌కలెక్టర్ కార్తీక్, అగ్రికల్చర్ ఏడీ అల్తాఫ్‌అలీఖాన్ తెలిపారు. హిందూపురం మండలంలోని కిరికెర 1 రైతుభరోసా కేంద్రంలో రైతులకు రాగి సాగుపై అవగాహన కల్పించారు. రాగి విత్తనం 4 కిలోల ప్యాకెట్ 50 శాతం రాయితీతో రూ.139 కే ప్రభుత్వం అందజేస్తోందన్నారు. అలాగే రూ.3864 మద్దతు ధరతో కొనుగోలు చేయడం జరుగుతుందన్నారు.




రైతులతో మాట్లాడుతున్న జేడీఏ సుబ్బారావు

పరిగి: ప్రభుత్వం రాగి పంట సాగు చేసే రైతులకు అనేక ప్రోత్సాహకాలను అందిస్తుందని, వాటిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఏఓ విజయభారతి తెలిపారు. బుధవారం మండలంలోని మోదా, మోదా–1, శ్రీరంగరాజుపల్లి గ్రామాల్లో రైతులకు అవగాహన కల్పించారు.


సబ్సిడీ విత్తనాలకై నమోదు చేసుకోండి

మడకశిరరూరల్: 50 శాతం సబ్సిడీపై అందజేయనున్న రాగి విత్తనాల కోసం రైతులు ఆర్బీకేల్లో పేర్లు నమోదు చేసుకోవాలని ఏఓ తిమ్మప్ప తెలిపారు. నాలుగు కేజీల ప్యాకెట్ పూర్తి ధర రూ.278 కాగా రాయితీ రూ.139 రైతు వాటా రూ.139 చొప్పున చెల్లించాలన్నారు.


'నీట్'లో విద్యార్థుల ప్రతిభ



జస్వంత్ కుమార్‌రెడ్డి



సీఆర్ హితేష్ రెడ్డి




ఎస్.అఫ్సాన్ సనా

గోరంట్ల: నీట్ పరీక్ష ఫలితాల్లో లేపాక్షి నవోదయ విద్యార్థి ప్రతిభ చూపారు. మండల పరిధిలోని కరావులపల్లికి చెందిన టీచర్ రంగారెడ్డి , పుష్పలత దంపతుల కుమారుడు పెద్దిరెడ్డి గారి జస్వంత్‌కుమార్ రెడ్డి నవోదయ పాఠశాలలో ఇంటర్ చదివారు. నీట్ పరీక్షలో 613 మార్కులు సాధించడంతో ఆల్ ఇండియాస్థాయిలో 21,647 ర్యాంకు వచ్చిందని కుటుంబ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు.

హిందూపురం టౌన్: నీట్ పరీక్షలో హిందూపురం పట్టణానికి చెందిన విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. పట్టణంలోని ఎస్.సడ్లపల్లికి చెందిన రాధమ్మ, రాజగోపాల్‌రెడ్డి కుమారుడు సీఆర్ హితేష్‌రెడ్డి 720 మార్కులకు 615 మార్కులు సాధించి 21,096వ ర్యాంకు సాధించారు. అలాగే పట్టణానికి చెందిన నూర్ షరీఫ్, షబానా బేగం కుమార్తె ఎస్.అఫ్సాన్ సనా ఆల్ ఇండియా నీట్ పరీక్షల్లో 566 మార్కులు సాధించి 51,300 ర్యాంకు సాధించారు.

పండ్ల తోటల పెంపకాన్ని ప్రోత్సహించండి



ఉపాధి సిబ్బందితో సమీక్షిస్తున్న ఏపీడీ ఓబుళప్ప

రొళ్ల: మండలంలో డ్రైలాండ్ హార్టికల్చర్ (మెట్ట ప్రాంతాల్లో) పండ్ల తోటల సాగు కోసం సన్న, చిన్నకారు రైతులను ప్రోత్సహించాలని ఏపీడీ ఓబుళప్ప పేర్కొన్నారు. బుధవారం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఉపాధి సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ముందుగా హొట్టేబెట్ట పంచాయతీలో చేపట్టిన ఉపాధి పనులను పరిశీలించారు. ఏపీడీ ఓబుళప్ప మాట్లాడుతూ రొళ్ల మండలంలో 2023–24 ఆర్థిక సంవత్సరంలో పండ్లతోటల పెంపకానికి 200 ఎకరాలు మంజూరైందన్నారు. ఆసక్తి గల రైతులు రెండురోజుల్లోగా క్షేత్రసహాయకులకు దరఖాస్తులు అందజేయాలని సూచించారు.

మహిళ ఆచూకీ లభ్యం



మౌనికను తహసీల్దార్ ముందు హాజరు పర్చిన దృశ్యం

చిలమత్తూరు: మండల కేంద్రానికి చెందిన మౌనిక అనే మహిళ మూడేళ్ల క్రితం అదృశ్యమైంది. ఆమె తల్లిదండ్రులు 2020లో స్థానిక పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్‌ఐ శ్రీనివాసులు కేసు దర్యాప్తు చేయగా ఆమె బెంగళూరులో ఉన్నట్లు గుర్తించారు. బుధవారం ఆమెను తీసుకువచ్చి తహసీల్దార్ నాగరాజు ముందు హాజరు పర్చినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ప్రతిభ చాటిన విద్యార్థినికి నగదు బహుమతి

లేపాక్షి: మండలంలోని చోళసముద్రం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతిలో పాఠశాలలోనే అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థిని సీఆర్.హర్షినికి వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నారాయణస్వామి బుధవారం నగదు బహుమతి అందజేశారు. ఇటీవల పాఠశాలలో జరిగిన రాగి జావ పంపిణీ కార్యక్రమానికి హాజరైనప్పుడు 10వ తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన వారికి నగదు బహుమతి అందిస్తానని హామీ ఇచ్చారు. ఆమేరకు నగదును అందించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు శ్రీనివాసరెడ్డి, ఎన్ఆర్ఐ కేశవమూర్తి, పీసీ మోహన్, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇన్‌చార్జ్ తహసీల్దార్‌గా గురుబ్రహ్మ

అమరాపురం: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఇన్‌చార్జ్ తహసీల్దార్‌గా గురుబ్రహ్మ బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న తహసీల్దార్ సురేష్‌కుమార్ సోమందేపల్లికి బదిలీ అయ్యారు. కలెక్టర్ ఆదేశాల మేరకు భూ రీసర్వే డీటీగా విధులు నిర్వర్తిస్తున్న గురుబ్రహ్మకు ఇన్‌చార్జ్ తహసీల్దార్‌గా ఉత్తర్వులు రావడంతో ఆయన బాధ్యతలు స్వీకరించారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

రొద్దం: మండల కేంద్రంలోని పెన్నానది నుంచి అనుమతి లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను సీజ్ చేసినట్లు ఎస్‌ఐ నాగస్వామి చెప్పారు. బుధవారం తురకలాపట్నం గ్రామానికి చెందిన ఉప్పర వెంకటేసులు అనే వ్యక్తి పెనుకొండకు ట్రాక్టర్‌తో ఇసుక తరలిస్తుండగా అడ్డుకున్నట్లు తెలిపారు. కేసు నమోదు చేసి ట్రాక్టర్ సీజ్ చేశామన్నారు.

మండల సర్వేయర్‌గా పద్మ బాధ్యతలు

అమరాపురం: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మండల సర్వేయర్‌గా పద్మ బాధ్యతలు స్వీకరించారు. మండలంలో భూ సర్వే సమస్యలను పరిష్కరించడానికి కృషి చేస్తానని ఆమె పేర్కొన్నారు. మండల ప్రజలకు అందుబాటులో ఉండి సేవలందిస్తానన్నారు.